అతివేగానికి 'లేజర్ గన్'తో చెక్

- సిగ్నల్ జంప్ చేసినా దొరికిపోవాల్సిందే
- కేబీఆర్ పార్కు రోడ్డులో ప్రత్యేక కెమెరా
- 20 రోజుల్లో భారీగా పట్టుబడిన వాహనాలు

బంజారాహిల్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారు. ట్రాఫికింగ్‌లో కొత్త మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. సాధరణంగా సిగ్నల్స్ వద్ద విధుల్లో ఉండే పోలీసులు కనిపించకపోతే వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించి తమకు ఇష్టం వచ్చినట్లు వెళ్తుంటారు. ఇదే పలుమార్లు ప్రమాదాలకు దారితీస్తుంది. దీంతో వాహనదారుల్లో క్రమశిక్షణ పెంచేందుకు ట్రాఫిక్ పోలీసులు సీసీ కెమెరాలను వినియోగిస్తున్నారు. అయితే సాంకేతిక సమస్యల కారణంగా చాలాచోట్ల అవి పనిచేయడం లేదు. ఈ విషయం పసిగట్టిన వాహనచోదకులు సిగ్నల్స్ వద్ద అతివేగంతో దూసుకెళ్తున్నారు. ఇలాంటి వారికి కళ్లెం వేసేందుకు నగర ట్రాఫిక్ పోలీసులు లేజర్ గన్ వినియోగిస్తున్నారు. ప్రయోగాత్మకంగా కేబీఆర్ పార్కు వద్ద దీన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 1 నుంచి చెట్లు, పొదల మధ్య నుంచి ఈ లేజర్ గన్‌తో నిఘా పెట్టారు.


కేబీఆర్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన లేజర్ గన్



వేగంగా వెళ్తున్న వాహనాన్ని గుర్తించిన లేజర్ గన్

లేజర్ గన్‌కు చిక్కిన 1,452 వాహనాలు

కేబీఆర్ ఉద్యానవనం నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టుకు వెళ్లే మార్గంలో లేజర్ గన్‌ను ఏర్పాటు చేయగా ఆదివారం ఒక్కరోజే 200లకు పైగా వాహనాలు పరిమితికి మించిన వేగంతో ప్రయాణించడంతో లేజర్ గన్‌కు చిక్కాయి. ఈ నెల 1 నుంచి చూస్తే 1,452కు పైగా వాహనాలు నిర్దిష్ట వేగాన్ని మించి వెళ్తుండడాన్ని గుర్తించి చలానాలు వేశారు. 60కి.మీ వేగం దాటిన వారిపై కేసులు సైతం నమోదు చేసి రూ.1000 చొప్పున జరిమానా విధించారు.

రేసింగ్‌లకు కళ్లెం వేసేలా..

కేబీఆర్ పార్కు, నెక్లెస్ రోడ్డు, ట్యాంక్‌బండ్ సహా 22 రోడ్లలో రేసింగ్‌లు అధికంగా జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఆయా రోడ్లపై వేగాన్ని గమనించేందుకు లేజర్ కెమెరాలను ఏర్పాటు చేశారు. 180 కి.మీ వేగంతో వెళ్లే వాహనాలను సైతం ఈ కెమెరా గుర్తించి ఫొటో తీస్తుంది. నంబర్ ప్లేట్ స్పష్టంగా వచ్చేలా అత్యాధునిక లెన్స్‌ను ఇందులో ఏర్పాటు చేశారు. కూడళ్లలో ఫ్రీ లెఫ్ట్‌లను బ్లాక్ చేస్తే వెంటనే రికార్డు అయ్యేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు సైతం అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మరోవైపు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ మార్గాల్లో ప్రతినిత్యం సీఎం రేవంత్‌రెడ్డితో పాటు అనేకమంది ప్రముఖులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆ సమయంలో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఈ రోడ్లలో ఎల్ అండ్ టీ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పోలీసులు అనుసంధానం చేసుకున్నారు.

మంచి ఫలితాలనిస్తోంది

బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు వద్ద ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన లేజర్ గన్ అనుకున్న దానికంటే మంచి ఫలితాలను ఇస్తుంది. మొదటి పది రోజులు చాలా మంది మితిమీరిన వేగంతో వెళ్లారు. ఆ తర్వాత లేజర్ గన్ ఉందని తెలియడంతో నెమ్మదిస్తున్నారు. దీనివల్ల ప్రమాదాలు తగ్గుతున్నాయి. ట్రాఫిక్ అధికంగా ఉన్న మిగతా కూడళ్లలోనూ వీటిని ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం.

- కట్టా హరిప్రసాద్, ట్రాఫిక్ ఏసీపీ


దివ్యాంగురాలికి అసెస్మెంట్ కరపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

నేడు ఖైరతాబాద్‌లో 'దివ్యాంగుల అసెస్మెంట్'

బంజారాహిల్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు చేయూతనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల అసెస్మెంట్‌ను ప్రవేశపెట్టిందని జూబ్లీహిల్స్ బీజేపీ నాయకులు అన్నారు. ఫిలింనగర్ దుర్గాభవానీనగర్ 'దివ్యాంగుల అసెస్మెంట్' కరపత్రాలను శనివారం దివ్యాంగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. 40 శాతం వైకల్యం ఉన్న వారిని ఆదుకునేందుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చొరవతో ఈ నెల 24న ఖైరతాబాద్ సరస్వతీ విద్యా మందిర్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డివిజన్ ఉపాధ్యక్షులు బోయ రామాంజనేయులు, పోలింగ్ బూత్ కార్యదర్శి పెద్దు రాజు తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాల మహానాడు నాయకులు

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 1న సభ

బోరబండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పరేడ్ మైదానంలో డిసెంబర్ 1న జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని మాల మహానాడు బోరబండ కన్వీనర్ పవనం శివశంకర్, జై భీమ్ యాదగిరి పిలుపునిచ్చారు. శనివారం డివిజన్‌లోని పలు బస్తీల్లో ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చట్ట విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పుల్లయ్య, రాజు, బాలరాజు, చిట్టి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లను కాపాడుకోవాలి

పంజాగుట్ట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లను కాపాడుకునే బాధ్యత ప్రతి దళితుడికి ఉందని ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్‌రావు అన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో శనివారం చింతల్ బస్తీలో జరిగిన సమావేశంలో డిసెంబరు 1న పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జన సభ పోస్టరును ఆయన సమితి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ రాజు వస్తాదు, కన్వీనర్ సర్వయ్య, నాయకులు సీహెచ్ యాదగిరి, శంకర్, మామిడి నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

ప్రక్రియను నిలిపివేయాలి

ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మాలల స్థితిగతులను తెలియజేసేందుకు డిసెంబరు 1న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో లక్షలాది మందితో మాలల సింహగర్జన సభను నిర్వహిస్తున్నామని.. మాలలు సభకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కేటీఆర్ సభను అడ్డుకుంటాం

- గిరిజన శక్తి అధ్యక్షుడు వెంకటేష్ చౌహాన్

పంజాగుట్ట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గిరిజనులను కేంద్ర బిందువుగా చేసుకొని బీఆర్ఎస్ పార్టీ రాజకీయ ప్రయోజనాలను పొందాలని, ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని కుట్రలు చేస్తోందని గిరిజన శక్తి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎం.వెంకటేష్ చౌహాన్ ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకుల మాటలను నమ్మి మోసపోవద్దని, కేటీఆర్ కుట్రలకు బలి కావొద్దని ఆయన ప్రజలకు సూచించారు. ఖైరతాబాద్‌లోని మింట్ కాంపౌండ్‌లో గిరిజన శక్తి రాష్ట్ర కమిటీ ముఖ్య నాయకుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖమ్మంలో గిరిజన రైతులు మిర్చి ధర పెంచమని కోరితే జైలుకు పంపిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదన్నారు. 25న మానుకోటలో జరగనున్న కేటీఆర్ సభను అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు శరత్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బు నాయక్, ముఖ్య సమన్వయకర్త రమేష్ రాథోడ్, నాయకులు విజయ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నెక్లెస్ రోడ్డులో 'వాక్ టు ఎంపవర్ హర్'

హైదరాబాద్ సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రై-చైల్డ్ రైట్స్ అండ్ యు ఆధ్వర్యంలో ఆదివారం నెక్లెస్ రోడ్డులో వాక్ టు ఎంపవర్ హర్ (బాలికలను సాధికారం చేద్దాం) అనే థీమ్‌తో అవేర్‌నెస్ వాక్ నిర్వహిస్తున్నారు. ఉదయం 7 నుంచి 9.30 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని క్రై-చైల్డ్ రైట్స్ అండ్ యు సౌత్ రీజనల్ డైరెక్టర్ జాన్ రాబర్ట్స్ తెలిపారు. బాలికల సాధికారత పట్ల సామూహిక నిబద్ధతను చాటి చెప్పడం, విద్య విషయంలో బాలికలు ఎదుర్కొంటున్న సవాళ్లపై సమాజంలో అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.


పాత వస్తువులను సేకరిస్తున్న అధికారులు

పాత వస్తువుల సేకరణకు స్పెషల్ డ్రైవ్

ఖైరతాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ సర్కిల్‌లో శనివారం నిర్వహించిన పాత వస్తువుల డ్రైవ్‌కు మంచి స్పందన లభించింది. కమలాపురి కాలనీ, వినాయక నగర్, ఎమ్మెల్యే కాలనీలలో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద ఇళ్లలోని పాత వస్తువులను, వినియోగంలో లేని ఫర్నిచర్‌ను ప్రజలు అందజేశారు. తొలి రోజు 3 ట్రక్కుల పాత సామగ్రి వచ్చిందని, ప్రతి శనివారం ఈ డ్రైవ్‌ను కొనసాగిస్తామని సర్కిల్ 18 ఉప కమిషనర్ ప్రశాంతి తెలిపారు.

ఓటరు జాబితాలో మార్పులకు నేడు అవకాశం

ఖైరతాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో మార్పులచేర్పుల కోసం కోసం పోలింగ్ బూత్‌లలో నిర్వహించిన ప్రత్యేక శిబిరాలకు శనివారం స్పందన కరువైంది. ఖైరతాబాద్ నియోజకవర్గంలో కేవలం 13 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఆదివారం అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల అధికారి, సర్కిల్ 18 ఉపకమిషనర్ ప్రశాంతి కోరారు.

ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే సహించం

- ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే

బంజారాహిల్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే సహించేది లేదని పశ్చిమ మండలం డీసీపీ రాహుల్ హెగ్డే హెచ్చరించారు. అపోలో చౌరస్తాలో ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయనే ఫిర్యాదుల మేరకు ట్రాఫిక్ పోలీసులు శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఫుట్‌పాత్‌లపై వెలిసిన వ్యాపారాలను తొలగించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. చాలా చోట్ల వ్యాపారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ర్యాంప్‌లను నిర్మించారని, జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి త్వరలోనే మరోసారి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఆక్రమణలను తొలగిస్తామన్నారు. నో పార్కింగ్ బోర్డు వద్ద వాహనం నిలిపితే వెయ్యి రూపాయల జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కట్టా హరిప్రసాద్, ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.


అపోలో చౌరస్తాలో పర్యటిస్తున్న పశ్చిమ మండలం ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే

డేటా కంప్యూటింగ్‌పై అవగాహన

బంజారాహిల్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): డేటా కంప్యూటింగ్‌లో భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేందుకు 24 గంటల పాటు కొనసాగే 'డాటానిక్స్-24' డేటాథాన్ బంజారాహిల్స్ ముఫకంజా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ప్రారంభమైంది. డీఆర్డీవో మాజీ డైరెక్టర్, ప్రముఖ శాస్త్రవేత్త డా. విజయ్ సింగ్ డేటాథాన్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. మారిన కాలంతో పాటు అందుబాటులోకి వచ్చిన అనేక టెక్నాలజీలతో డేటా సేవింగ్‌తో పాటు కంప్యూటర్లు అనేక మార్పులకు లోనయ్యాయన్నారు. యుద్ధ రంగంలో కంట్రోల్ రూమ్స్, ఇమేజ్ ప్రాసెసింగ్, రిమోట్ డిటెక్టింగ్ ఆఫ్ టార్గెట్స్ తదితర అంశాల్లో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌ను వినియోగిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఇంజనీరింగ్ విద్యార్థుల్లో ఏఐ పట్ల మరింత అవగాహన కల్పిస్తూ 24 గంటల పాటు డేటాథాన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీసీఎస్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ బాలప్రసాద్, సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి జాఫర్ జావెద్ తదితరులు పాల్గొన్నారు.


డాటానిక్స్‌లో స్టాళ్లను పరిశీలిస్తున్న డీఆర్డీవో మాజీ డైరెక్టర్ విజయ్ సింగ్

మురుగు సమస్యకు పరిష్కారం

బేగంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని బ్రాహ్మణవాడి వాసులు ఎదుర్కొంటున్న మురుగు సమస్యపై 'రోడ్డుపైనే మురుగు పరుగు' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనానికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్పందించారు. వాటర్ వర్క్స్ జీఎం వినోద్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో వాటర్ వర్క్స్ జీఎం, డీజీఎం ఆశీష్‌లతో పాటు సిబ్బంది బ్రాహ్మణవాడిలోని మురుగు నీరు వస్తున్న రైల్వే గోడ వద్ద శనివారం ఉదయం పనులను ప్రారంభించారు. కార్పొరేటర్ టి.మహేశ్వరి పనులను పర్యవేక్షించారు. రెండు రోజుల్లో సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని కార్పొరేటర్ స్థానికులకు హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఆంధ్రజ్యోతికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి

శ్మశానవాటిక పనులను పూర్తిచేయాలి


ఎమ్మెల్యే తలసానికి వినతిపత్రం అందజేసిన సలీమ్‌ఖాన్ తదితరులు

బేగంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని ఓల్డ్ కస్టమ్స్ బస్తీ శ్మశానవాటికలో సమస్యలను పరిష్కరించాలని శ్మశానవాటిక కమిటీ అధ్యక్షుడు సలీమ్‌ఖాన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు సలీంఖాన్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో శ్మశానవాటిక కోసం ఒకటిన్నర ఎకరం కేటాయించారని, స్థలాన్ని చదును చేయడంతో పాటు ఇందులో ఉన్న హెచ్‌పీఎస్ క్వార్టర్స్‌ను తొలగించి ప్రహరీని నిర్మించామన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పనులు ఆగిపోయాయన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి వెంటనే పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ టి.మహేశ్వరి, కమిటీ ప్రతినిధులు అజీజ్, సాబెర్, అమీర్ బిన్ అబ్దుల్లా, సిరాజ్ అమ్మద్‌ఖాన్, బీఆర్ఎస్ నాయకులు టి.శ్రీహరి పాల్గొన్నారు.

ఘనంగా మెరీడియన్ స్కూల్ వార్షికోత్సవం

బంజారాహిల్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని మెరీడియన్ స్కూల్ వార్షికోత్సవాన్ని శనివారం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఉత్కర్ష్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చేతుల మీదుగా ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న డాక్టర్ ప్రీతి శర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రీతి శర్మ మాట్లాడుతూ.. క్రమశిక్షణ కలిగిన విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రెసిడెంట్ లలితా నాయుడు, మెరీడియన్ విద్యాసంస్థల వ్యవస్థాపకురాలు బుట్టా రేణుక, సీఈవో తేజస్విని, సీవోవో అమోఘ్ బుట్టా, ప్రిన్సిపాల్ భవాని పాల్గొన్నారు.


సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

మోదీపై ప్రజల్లో విశ్వాసం పెరిగింది

- మాజీ ఎమ్మెల్యే చింతల

బంజారాహిల్స్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ మీద ప్రజల్లో విశ్వాసం పెరిగిందని, అందుకే మహారాష్ట్ర ప్రజలు బీజేపీ కూటమికి పట్టం కట్టారని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మహారాష్ట్రలో ఎన్‌డీఏ విజయం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. సాగర్ సొసైటీలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధిపై ప్రజలంతా ఆనందంగా ఉన్నారన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

రహ్మత్‌నగర్‌లో రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలి

యూసుఫ్‌గూడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్‌లోని వెనుకబడిన వర్గాలకు చెందిన వారి పిల్లలు చదువుకునేందుకు రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలని, పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ కేటాయించాలని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం తెలంగాణ వెనుకబడిన రగతుల కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బహిరంగ విచారణ' కార్యక్రమంలో ఆయన వినతిపత్రం అందించారు. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.


జీఐఎస్ దినోత్సవ కార్యక్రమంలో ప్రతినిధులతో డాక్టర్ జనార్దన్‌రెడ్డి

ఘనంగా జీఐఎస్ దినోత్సవం

ఖైరతాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జీఐఎస్ దినోత్సవాలను విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహించారు. జియో మ్యాప్ సొసైటీ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ తెలంగాణ రాష్ట్ర శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మ్యాపింగ్ మైండ్స్, షేపింగ్ ది వరల్డ్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. మన దేశం గ్లోబల్ పవర్‌గా ఎదిగేందుకు జీఐఎస్‌ను విస్తృతంగా ఉపయోగించుకునే సాంకేతికత అవసరమన్నారు. ప్రాదేశిక దృక్పథంతో మంచి కోసం ముందుకువెళ్లాలని సూచించారు. ప్రతి సంవత్సరం నవంబరు మూడవ బుధవారం జీఐఎస్ డేగా జరుపుకుంటామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జియో మ్యాప్ సొసైటీ ప్రతినిధి మేజర్ శివకిరణ్, ఐఈఐ కార్యదర్శి సీతారామారావు, సంయుక్త కార్యదర్శి డి.రమ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయ సందర్శనకు టూరిజం కార్పొరేషన్ ఎండీ

అమీర్‌పేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ ఆలయాన్ని శనివారం రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ప్రకాశ్‌రెడ్డి సందర్శించారు. ప్రసాదం పథకంలో భాగంగా రూ.4.40 కోట్లతో నిర్మించనున్న అన్నదాన మండపం వివరాలను సూపరింటెండెంట్ హైమావతిని అడిగి తెలుసుకున్నారు. దేవాలయం వెనుక వైపు ఉన్న 400 గజాల స్థలంలో ఆధునిక సౌకర్యాలతో కల్యాణ మండపం నిర్మించేందుకు గత మార్చిలో ప్రధాని నరేంద్ర మోదీతో వర్చువల్‌గా శంకుస్థాపన చేసినట్లు ఆమె పేర్కొన్నారు. భవన నిర్మాణానికి జీహెచ్ఎంసీ అనుమతులు ఉన్నాయా అని ప్రకాశ్‌రెడ్డి ప్రశ్నించగా.. ఈ విషయంపై తమకు సమాచారం లేదని హైమావతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డెరెక్టర్ రామకృష్ణ, ఇంజనీరింగ్ విభాగం వర్క్ ఇన్‌స్పెక్టర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.


అన్నదాన మండపం గురించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ప్రకాశ్ రెడ్డి


యోగాసనాలు వేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

యోగాతో మానసిక ఉల్లాసం

యూసుఫ్‌గూడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడ ప్రథమ పటాలంలో శనివారం పోలీసు అధికారులు, సిబ్బందికి యోగా తరగతులు నిర్వహించారు. శ్రీనగర్‌కాలనీలోని కపిల మహర్షి యోగా కేంద్రం నిర్వాహకులు డాక్టర్ సీవీ రావు యోగాసనాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా కమాండెంట్ జి.మురళీకృష్ణ మాట్లాడుతూ.. యోగా, ప్రాణాయామం వల్ల శరీరం ఎంతో ఆరోగ్యంగా ఉండటంతో పాటు మానసిక ఉల్లాసం, ప్రశాంతత ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ జి.నరేందర్ సింగ్, ఆర్ఐలు ధర్మారావు, సాంబయ్య, శంకర్, రాజేష్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

మలబార్ గోల్డ్‌లో మోడల్స్ సందడి

బేగంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని మలబార్ గోల్డ్‌లో శనివారం ఆకర్షణీయమైన ఆఫర్లతో బ్రైడ్ ఆఫ్ ఇండియా ఫెస్టివల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మోడల్స్ సందడి చేశారు. డైమండ్, విలువైన రత్నాభరణాలు, మరెన్నో ప్రత్యేక బ్రైడల్ జ్యువెలరీ కలెక్షన్లను పరిచయం చేశారు. స్టోర్ హెడ్ మహ్మద్ అలీ రజయ్ మాట్లాడుతూ.. బ్రైడ్ ఆఫ్ ఇండియా ఫెస్టివల్ ద్వారా విశిష్టమైన డిజైన్లు, సరికొత్త ఆవిష్కరణలను తీసుకువచ్చామన్నారు.



డైమండ్ జ్యువెలరీలను ప్రదర్శిస్తున్న మోడల్స్‌తో మలబార్ గోల్డ్ స్టోర్ హెడ్ మహ్మద్ అలీ రజయ్ తదితరులు


బంజారాహిల్స్ ధర్మశాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైన అయ్యప్ప మాలధారుల అన్నదాన కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వాములకు భోజనం వడ్డించారు.
- బంజారాహిల్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి)

పెద్ద పిల్లలనూ దత్తత తీసుకోవాలి

- సీఏఆర్ఏ సీఈఓ భావనా సక్సేనా

యూసుఫ్‌గూడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పిల్లలు లేని దంపతులు చిన్నపిల్లలనే కాకుండా పెద్దపిల్లలను సైతం దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలని సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ(సీఏఆర్ఏ) సీఈఓ బావనా సక్సేనా సూచించారు. శనివారం యూసుఫ్‌గూడ నిమ్స్‌మే ఆడిటోరియంలో తెలంగాణ ప్రభుత్వ ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ దత్తత మాసం కార్యక్రమం నిర్వహించారు. 'పెద్ద వయసు పిల్లల దత్తత' అనే అంశంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆమె మాట్లాడుతూ.. 95శాతం మంది 0-6సంవత్సరాల లోపు చిన్నారులను దత్తత తీసుకునేందుకు ఇష్టపడుతున్నారని, 6 నుంచి 19 సంవత్సరాల వారిని సైతం దత్తత తీసుకునే విధంగా అవగాహన పెరగాలన్నారు. రీజినల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ స్నేహజ జొన్నలగడ్డ మాట్లాడుతూ.. దత్తత కోసం విదేశాల నుంచి వచ్చేవారికి పిల్లలకు పాస్‌పోర్ట్ అవసరం ఉంటుందని, వారికి వెంటనే పాస్‌పోర్ట్ ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి అనిత రామచంద్రన్, డైరెక్టర్ ఆఫ్ ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఏ.కాంతి వెస్లీ, ఎస్‌సీపీసీఆర్ ప్రతినిధులు అపర్ణ పాల్గొన్నారు.


పెద్ద పిల్లల దత్తత పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భావనా సక్సేనా తదితరులు

హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తాం



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

మారేడుపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం వెస్ట్‌మారేడుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆశావర్కర్లు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో అనేక హామీలను ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా అమలు చేయడంలేదని వారు ఎమ్మెల్యేకు వివరించారు. ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి పరిష్కరించాలని కోరారు. వినతి పత్రాన్ని అందజేసిన వారిలో ఉమాదేవి, విజయలక్ష్మీ, శశికళ, మానస, మమత, ధన ఉన్నారు.

శ్మశానవాటికలో పెండింగ్ పనులను పూర్తి చేయండి

బేగంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్ ఓల్డ్ కస్టమ్స్ బస్తీలోని శ్మశానవాటికలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని పలువురు కోరారు. శుక్రవారం శ్మశానవాటిక కమిటీ అధ్యక్షుడు సలీంఖాన్ ఆధ్వర్యంలో పలువురు ముస్లింలు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో శ్మశానవాటిక కోసం ఏకరన్నర ఎకరం భూమిని కేటాయించగా, ఆ స్థలాన్ని చదును చేసి, అందులో ఉన్న హెచ్‌పీఎస్ క్వార్టర్స్ తొలగించి గోడను నిర్మించామని తెలిపారు. ఇటీవల రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో శ్మశానవాటిక పనులు ఆగిపోయాయన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి వెంటనే పెండింగ్ పనులను పూర్తి చేయాలని వారు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ టి.మహేశ్వరి, కమిటీ ప్రతినిధులు అజీజ్, సాబెర్, అమీర్‌బిన్ అబ్దుల్లా, సిరాజ్ అహ్మద్‌ఖాన్, బీఆర్ఎస్ నాయకుడు టి. శ్రీహరి పాల్గొన్నారు.



టపాసులు కాలుస్తున్న కాంగ్రెస్ శ్రేణులు.

బొల్లారంలో కాంగ్రెస్ పార్టీ సంబురాలు

తిరుమలగిరి నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం, వయనాడ్ ఎంపీగా ప్రియాంకగాంధీ విజయం సాధించడంతో నగరంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబురాలు జరుపుకొన్నారు. శనివారం బొల్లారం, డౌటన్ బజార్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నర్సింహన్ కన్నన్ ఆధ్వర్యంలో టపాసులు కాల్చారు. కేక్‌కట్ చేసి స్వీట్లు అందరికీ పంచిపెట్టారు. పేద వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వయనాడ్ పార్లమెంట్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు శనివారం ప్రకటించగా ప్రియాంకగాంధీ 4 లక్షలకు పైగా మెజార్టీ సాధించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ విపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలంతా కాంగ్రెస్ వైపు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ జీవీ బాల్‌రాజ్, రషీద్, దినేష్, అహ్మద్, సాదిక్, సతీష్, సుశీల్, మణిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీతాఫల్‌మండి చౌరస్తాలో సంబురాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

సీతాఫల్‌మండిలో బీజేపీ నాయకుల సంబురాలు

బౌద్ధనగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ అత్యధిక మెజార్టీతో విజయం సాధించటంతో శనివారం రాత్రి సీతాఫల్‌మండి చౌరస్తాలో ఆపార్టీ నాయకులు సంబురాలు నిర్వహించారు. బాణాసంచాను కాల్చి స్థానికులకు మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో భారతదేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నదన్నారు. అందుకే దేశప్రజలు బీజేపీకి పట్టం కడుతున్నారన్నారు. కార్యక్రమంలో సారంగపాణి, పి.రవిప్రసాద్‌గౌడ్, కందాడి నాగేశ్వరరెడ్డి, కనకట్ల హరి, ప్రభుగుప్తా, మద్దెర్ల శ్యాంసుందర్, వెంకటేశ్‌గౌడ్, సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర కులస్థుల సమస్యలనూ పరిగణనలోకి తీసుకోవాలి



విచారణ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న వడ్డెర కులస్థులు

అడ్డగుట్ట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వడ్డెర కులస్థుల సమస్యలనూ పరిగణనలోకి తీసుకోవాలని వడ్డెర రిజర్వేషన్ పోరాట సమితి(వీఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గుంజి సంతోష్‌కుమార్ కోరారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన బీసీ బహిరంగ విచారణ కార్యక్రమానికి హాజరై వీఆర్‌పీఎస్ సభ్యులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎంబీసీ రిజర్వేషన్ తొలగించారని అన్నారు. వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని 50 ఏళ్లుగా ప్రభుత్వాలను వేడుకుంటున్నామని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో వడ్డెర రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిశెట్టి శివకృష్ణ, రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షుడు గోగుల స్వామి, గ్రేటర్ యూత్ కన్వీనర్ గండికోట భరత్ కుమార్ తదితరులు ఉన్నారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు



బేగంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణవాడి బస్తీలో మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'రోడ్డుపైనే మురుగు పరుగు' కథనానికి సనత్‌నగర్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్పందించారు. వాటర్ వర్క్స్‌జీ.ఎం వినోద్‌తో ఫోన్ మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్పొరేటర్ మహేశ్వరిని సంఘటనా స్థలంకు వెళ్లి పనులు జరిగేలా చూడాలని సూచించారు. దీంతో వాటర్‌వర్క్స్ జీఎం వినోద్, డీజీఎం ఆశీష్‌తో తమ సిబ్బందితో వచ్చి బ్రాహ్మణవాడిలోని మురుగునీరు వస్తున్న రైల్వేగోడ వద్ద శనివారం ఉదయం పనులను ప్రారంభించారు. దీంతో అక్కడకు చేరుకున్న కార్పొరేటర్ టి.మహేశ్వరి పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. రైల్వే గోడ నుంచి మురుగునీరు వస్తున్న చోట పనులను చేపట్టారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని ఈ సందర్భంగా కార్పొరేటర్ మహేశ్వరి స్థానికులకు హామీ ఇచ్చారు.

ఆయుష్ కమిషనర్‌ను కలిసిన 'హోమియో డాక్టర్లు'

సికింద్రాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆయుష్ కమిషనర్ చిట్టం లక్ష్మిని సికింద్రాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో తెలంగాణ హోమియో డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చినుకని శివప్రసాద్ శనివారం కలిశారు. ఈ సందర్భంగా హోమియోపతి వైద్యుల సమస్యలు, మెడికల్ ఆఫీసర్, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్, పి.జి.విద్యార్థుల ఉపకార వేతనాల గురించి కమిషనర్‌కు వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్, ఉపాధ్యక్షుడు డాక్టర్ వివేక్, సలహాసభ్యులు డాక్టర్ ప్రదీప్ పాల్గొన్నార

- 5 నెలల క్రితం పూడికతీత
- పట్టించుకోని అధికారులు
- దుర్వాసన, దోమలతో స్థానికుల ఇబ్బందులు
- అనారోగ్యాల బారిన చిన్నపిల్లలు, వృద్ధులు

అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పట్టింపులేని కారణంగా నాలాల్లో చెత్త చెదారం పేరుకుపోతున్నది. నెలల తరబడి నాలాల్లో పూడికతీత పనులను సంబంధిత అధికారులు చేపట్టడం లేదు. దీంతో దుర్వాసన, దోమలతో నాలాకు ఇరువైపులా ఉన్న ప్రజలు అనారోగ్యాల బారినపడుతున్నారు. ఇది సికింద్రాబాద్ నియోజకవర్గం సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్‌లలోని దుస్థితి.



అన్నానగర్ నాలాలో చెత్త, వ్యర్థాలు

సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్‌లలో

నాలాల్లో పేరుకుపోతోన్న చెత్త

బౌద్ధనగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడ భవానీనగర్, అన్నానగర్, శ్రీనివాసనగర్, మహ్మద్‌గూడ నుంచి బౌద్ధనగర్ డివిజన్‌లోని షాబాద్‌గూడ, పుల్లయ్యబావి, న్యూఅశోక్‌నగర్, ఎల్.నారాయణనగర్ ఈశ్వరీ బాయినగర్, బౌద్ధనగర్ డివిజన్‌లోని కొన్ని ప్రాంతాల వరకు నాలాలు విస్తరించి ఉన్నాయి. నాలాకి ఇరువైపులా పేద, మధ్యతరగతి ప్రజలు నివాసం ఉంటున్నారు. సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్‌లలోని నాలాల్లో పూడికతీత పనులు చేపట్టడానికి దాదాపు రూ. 50లక్షల నిధులు మంజూరు చేశారు. జీహెచ్ఎంసీ పాలన యంత్రాంగం సంవత్సరంలో మూడు విడతల్లో నాలాల్లో పూడికతీత పనులను చేపట్టాలి. ఇందులో మొదటగా నాలాల్లో చెత్తను, రెండోసారి రాళ్లను తీసివేయాలి. మూడోసారి నాలాల్లో అడుగులోతు మట్టిని బయటకు తీయాల్సి ఉంది. అయితే 5 నెలల క్రితం పూడికతీతపనులు చేపట్టి తర్వాత నిర్లక్ష్యంగా వదిలివేశారు. శ్రీనివాస్‌నగర్‌లో ప్రతీ శుక్రవారం కూరగాయాల సంత జరుగుతున్నది. దాదాపు 700మంది వ్యాపారులు కూరగాయల బండ్లను సంతలో పెట్టి విక్రయాలు జరుపుతుంటారు. సంత ముగిసిన అనంతరం చెత్తను మొత్తం కూరగాయల వ్యాపారులు నాలాలో పడేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనికితోడు సమీపంలో ఉంటున్న చికెన్, మాంసం దుకాణాల నిర్వాహకులు రాత్రిపూట వ్యర్థాలను, కార్ఖానా నిర్వాహకులు పాడైన సామగ్రిని తీసుకొచ్చి నాలాల్లో పడేస్తున్నారు. దాంతో నాలాల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు దుకాణాలు, కార్ఖానా యజమానులకు నోటీలిచ్చి జరిమానాలు విధించినా ఫలితం లేదు. ఎప్పటికప్పుడు నాలాల్లో పూడికతీతపనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



శ్రీనివాసనగర్ మార్కెట్ నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు

విపరీతమైన దుర్వాసన వస్తున్నది



నాలాల్లో చెత్త నిల్వ ఉండటంతో దుర్వాసన విపరీతంగా వస్తున్నది. వృద్ధులు, పిల్లలు అనారోగ్యాలకు బారినపడుతున్నారు. రాత్రుళ్లు కొంతమంది వాహనాల మీద చెత్తను సంచులను తీసుకొచ్చి నాలాలో విసిరి వేస్తున్నారు. నాలాల పక్కన నుంచి నడిచి వెళ్లే పరిస్థితి లేదు. నాలాల్లో దోమలు వృద్ధి చెంది ఇంట్లో రాత్రుళ్లు ప్రశాంతంగా నిద్రపోలేని పరిస్థితి ఉంది.

\- పాతూరి శ్రీలత, శ్రీనివాసనగర్

పూడికతీత పనులు చేపట్టాలి



నెలకొకసారి నాలాల్లో పూడికతీత పనులు చేపట్టాలి. నాలాల వెంబడి ఉన్న దుకాణాలపై అధికారులు నిఘా పెట్టాలి. నాలాల్లో చికెన్, మటన్‌కు సంబంధిచిన వ్యర్థ పదార్థాలు వేసే వారిపై చర్యలు తీసుకోవాలి. ఎప్పటికపుడు పూడికతీత పనులు చేపట్టడం వలన నాలా పరిహాక ప్రాంతాల్లో నివశించే వారికి ఇబ్బందులు ఉండవు.

\- సంపత్, నామాలగుండు

నాలాలకు ఇరువైపులా కంచె ఏర్పాటు చేసినా..

నాలాల్లో చెత్త, వ్యర్థాలను వేస్తున్నారని ఫిర్యాదులు రావటంతో అప్పటి మంత్రి, ప్రస్తుత సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ మూడేళ్ల క్రితం అధికారులు, కార్పొరేటర్లు తీసుకుని భవానీనగర్, అన్నానగర్, మహ్మద్‌గూడ, షాబాద్‌గూడ, పుల్లయ్యబావి, న్యూఅశోక్‌నగర్ వరకు విస్తరించి ఉన్న నాలాలను పరిశీలించారు. నాలాల్లో చెత్త వేయకుండా ఇరువైపులా కంచెను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించగా, ఇనుపకంచెను ఏర్పాటు చేశారు. అయినా దుకాణ యాజమానులు, స్థానికులు ఇనుపకంచెను కట్‌చేసి నాలాల్లోకి చెత్త, వ్యర్థాలను పడవేస్తున్నారు. దీంతో నాలాల్లో మట్టి, దుస్తులు, ఇతర వస్తువులు పేరుకుపోతున్నాయి.

దేవాలయాల పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత: డీసీపీ రష్మీ పెరుమాళ్



సమావేశంలో మాట్లాడుతున్న నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్

బోయిన్‌పల్లి, నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం ప్రపంచానికి ఆదర్శమైన ఆధ్యాత్మిక కేంద్రమని, ఇక్కడ వందలాది సంవత్సరాల చరిత్ర కలిగిన దేవాలయాలు ఎన్నో ఉన్నాయన్నారు. అలాంటి ఆలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని అన్నారు. నార్త్‌జోన్ పరిధిలోని ఆలయ కమిటీల సభ్యులు, నిర్వాహకులతో బోయినపల్లిలోని గాయత్రి గార్డెన్స్‌లో బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, డీఐ సర్దార్ నాయక్ ఆధ్వర్యంలో వివిధ పోలీస్‌స్టేషన్‌ల ఇన్‌స్పెక్టర్‌ల సమన్వయంతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో దేవాలయాలపైన జరుగుతున్న దాడులు. దొంగతనాలు, ఆలయాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపైన అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్, అడిషనల్ డీసీపీ అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ దేవాలయాల పరిరక్షణకు ప్రజలను కూడా భాగస్వాములను చేస్తూ కాపాడుకోవాలని అన్నారు. ఆలయాలు, ప్రార్థన మందిరాల్లో బాధ్యతగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దొంగతనాలు, దాడులు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పోలీసు సిబ్బంది కూడా నిఘా ఉంచుతుందన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. నిర్వాహకులు, కమిటీ సభ్యులతో పాటు స్థానిక ప్రజలు నిత్యం గమనిస్తూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బేగంపేట్, గోపాలపురం, తిరుమలగిరి ఏసీపీలు గోపాలకృష్ణమూర్తి, సుబ్బయ్య, రమేష్ వివిధ పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐ, దేవాలయాల నిర్వాహకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షల షెడ్యూల్ విడుదల

కుషాయిగూడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నిర్వహించే టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. వివిధ గ్రేడ్‌లలో నిర్వహించే టైప్‌రైటింగ్ పరీక్షలు జనవరి 18, 19తేదీల్లో, షార్ట్‌హ్యాండ్ పరీక్షలు 25న నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 20 కేంద్రాల్లో టైప్ రైటింగ్, 6 కేంద్రాల్లో షార్ట్‌హ్యాండ్ పరీక్షలు నిర్వహిస్తామని సాంకేతిక విద్య, శిక్షణామండలి కార్యదర్శి ఆకుటి పుల్లయ్య వెల్లడించారు. పరీక్షల టైం టేబుల్‌ను సిద్ధంచేసి గుర్తింపు పొందిన ఇనిస్టిట్యూట్‌ల నిర్వాహకులకు సమాచారం అందజేశామన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా డిసెంబరు 20లోగా దరఖాస్తు చేసుకోవాలి. మొదటిసారి టైప్, షార్ట్ హ్యాండ్ పరీక్షలు రాసే అభ్యర్థులు గుర్తింపు పొందిన ఇనిస్టిట్యూట్ నుంచి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎనుముల అంటే.. అష్యూరెన్సు! : కిసాన్ కాంగ్రెస్

హైదరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయిన అసహనంలో సీఎం రేవంత్‌రెడ్డిపై హరీ‌ష్‌రావు ఏదేదో మాట్లాడుతున్నారని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి అన్నారు. ఎనుముల అంటే అష్యూరెన్సు అని, భట్టి అంటే బ్రాండ్ అని ఆయన గుర్తుపెట్టుకోవాలన్నారు. ఎనుముల రేవంత్‌రెడ్డి అంటే.. ఎగవేతల రేవంత్‌రెడ్డి అంటూ ఖమ్మంలో హరీ‌ష్‌రావు చేసిన వ్యాఖ్యలపై ఈ మేరకు స్పందించారు. గాంధీభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కన్నా ఇప్పటికే 3 లక్షల టన్నులు అదనంగా పత్తి కొనుగోళ్లు జరిగాయని, 12 శాతం తేమ ఉన్నా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. సన్నరకం ధాన్యానికి వారం రోజులుగా బోనస్ పడుతున్నా.. పడట్లేదంటూ హరీ‌ష్‌రావు అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ కృషి వల్లనే మత్స్యశాఖకు ఇన్‌ల్యాండ్ ఫిష్ స్టేట్ అవార్డు వచ్చిందని ఫిషర్మెన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు సాయికుమార్ అన్నారు.

ప్రియాంక చిత్ర పటానికి గాంధీభవన్‌లో క్షీరాభిషేకం

హైదరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వయనాడ్ లోక్‌సభ ఉపఎన్నికలో ఏఐసీసీ ప్రధానకార్యదర్శి ప్రియాంకగాంధీ అత్యధిక మెజారిటీతో విజయం సాధించడంతో గాంధీభవన్‌లో శనివారం పార్టీ నేతలు సంబరాలు జరిపారు. పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు(వీహెచ్) ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ వయనాడ్‌లో 4 లక్షల మెజారిటీతో గెలిచిన ప్రియాంకగాంధీ.. ఇందిరాగాంధీ వారసురాలిగా చరిత్ర సృష్టించారన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా రాహుల్, ప్రియాంక తిరిగి.. కాంగ్రెస్ పార్టీని కేంద్రంలో అధికారంలోకి తీసుకువస్తారని ధీమా వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో గెలుపు మోదీ, అమిత్‌షాలది కాదని, అదానీ, అంబానీలదని అన్నారు.



దత్తత పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఈవో భావనా సక్సేనా తదితరులు

పెద్దపిల్లల దత్తతకు ముందుకు రావాలి

యూసుఫ్‌గూడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పిల్లల్ని పెంచుకోవలనుకునే తల్లిదండ్రులు చిన్న పిల్లన్నే కాకుండా పెద్దపిల్లల్ని కూడా చట్టబద్ధమైన విధంగా దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలని సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ(సీఏఆర్ఏ) సీఈవో బావనా సక్సేనా అన్నారు. శనివారం యూసుఫ్‌గూడ నిమ్స్‌మే ఆడిటోరియంలో తెలంగాణ ప్రభుత్వ ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ దత్తత మాసం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 'పెద్ద వయసు పిల్లల దత్తత' అనే అంశంపై ఆమె మాట్లాడారు. పిల్లల్ని పెంచుకోవాలనే తల్లిదండ్రుల్లో 95శాతం మంది 0-6 సంవత్సరాలలోపు చిన్నారులను దత్తత తీసుకునేందుకు ఇష్టపడుతున్నారన్నారు. కానీ 6 నుంచి 13 సంవత్సరాలు, 13 నుంచి 19 సంవత్సరాల వారిని కూడా దత్తత తీసుకునే విధంగా అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఉద్యోగి బాధ్యతగా తీసుకుని దత్తత విధానాన్ని మరింత సరళతరమయ్యే విధంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. రీజినల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ స్నేహజ జోన్నలగడ్డ మాట్లాడుతూ వేరే పిల్లల్ని దత్తత తీసుకుని పెంచటం అనేది ఎంతో ఉత్తమమైన కార్యక్రమం అన్నారు. ఈ సందర్భంగా 'పెద్ద వయసు పిల్లల దత్తత' పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి అనితారామచంద్రన్, డైరెక్టర్ ఆఫ్ ఉమెన్ డెవలప్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఎ.కాంతివెస్లీ, ఎస్‌సీసీఆర్ ప్రతినిధులు అపర్ణ, అంజనారావు తదితరులు పాల్గొన్నారు.

మజ్దూర్ యూనియన్‌లో చేరిన రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నేతలు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఎంప్లాయిస్ సంఘ్‌కు భారీ షాక్ తగలింది. ఎంప్లాయీస్ సంఘ్‌కు చెందిన కీలక నాయకులు కృష్ణయ్య, హారతి రాజీనామా చేశారు. శనివారం సికింద్రాబాద్‌లోని కార్యాలయంలో మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్ సమక్షంలో మజ్దూర్ యూనియన్‌లో చేరారు. రైల్వేలో గుర్తింపు సంఘాలకు ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎంప్లాయిస్ సంఘ్‌లోని కీలకమైన నేతలు మజ్దూర్ యూనియన్‌లో చేరుతున్నారని శంకర్ తెలిపారు. ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ విజయం కోసం పనిచేస్తామని కృష్ణయ్య, హారతి తెలిపారు. కార్యక్రమంలో రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ కోశాధికారి సరోజినిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మురళి, డివిజనల్ కార్యదర్శి సంజీవయ్య, రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డిసెంబర్‌లో జరిగే దక్షిణ మధ్య రైల్వేకార్మిక సంఘ్ ఎన్నికల నేపథ్యంలో భారతీయ మజ్దూర్ సంఘ్ మేనిఫెస్టోను శనివారం సికింద్రాబాద్‌లో జోనల్ ప్రెసిడెంట్ ఎప్రాయీమ్, డి.పద్మానాభం, వై.లోకేశ్వర్ విడుదల చేశారు. (హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి)

బస్తీ నాది.. నేను చెప్పిందే వేదం

● **యువతిపై బీఆర్ఎస్ నేత అసభ్య పదజాలం**

అడ్డగుట్ట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'ఈ బస్తీ నాది, నేను చెప్పిందే వేదం, ఎవరన్నా అడ్డు వస్తే నా వెనుక కార్పొరేటర్ ఉంది. ఖబడ్దార్ అంటూ బీఆర్ఎస్ నాయకుడు కుటుంబ సభ్యులు ఓ యువతిని అసభ్య పదజాలంతో దూషించారు. బాధితురాలు తుకారాంగేట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళ్తే.. అడ్డగుట్టకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు శంకర్ ఇంటి పక్కన స్వరూప కుటుంబం కూడా ఉంటుంది. రెండు కుటుంబాల మధ్య రెండేళ్ల నుంచి చిన్నచిన్న గొడవలు జరుతుగున్నాయి. శుక్రవారం ఇంటి దగ్గర చెత్త విషయంలో గొడవ జరుగగా శంకర్ కుటుంబ సభ్యులు స్వరూపపై చేయి చేసుకున్నారు. స్వరూప తుకారాంగేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, దాడి చేస్తుండగా సెల్‌ఫోన్‌లో తీసిన వీడియోలను పోలీసులకు చూపించింది. దాడికి పాల్పడిన బీఆర్ఎస్ నేత శంకర్ అతడి భార్యపై కఠిన చర్యలు తీసుకోవలని కోరింది . కొద్దిసేపటి తర్వాత స్థానిక కార్పొరేటర్ భర్త, బీఆర్ఎస్ నాయకులు పోలీసులకు ఫోన్‌చేసి, శంకర్ బీఆర్ఎస్ పార్టీకి చెందిన వ్యక్తి, అతడిపై కేసు పెట్టవద్దన్నారు. తను ఇచ్చిన ఫిర్యాదు పక్కన బెట్టి దాడికి పాల్పడ్డ వ్యక్తుల ఫిర్యాదును పోలీసులు స్వీకరించడంపై బాధితురాలు ఆగ్రహం వ్యక్తం చేసింది. తనకు న్యాయం చేయకపోతే నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్‌ను ఆశ్రయిస్తానని తెలిపింది.

గుర్తుతెలియని వృద్ధురాలు మృతి

అడ్డగుట్ట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వృద్ధురాలు మృతిచెందింది. గోపాలపురం పోలీస్ స్టేషన్ ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ బుకింగ్ ఎదురుగా వృద్ధురాలు మృతిచెంది ఉన్నదని స్థానికుల ద్వారా సమాచారం అందింది. పోలీసులు అక్కడికి వెళ్లి మృతదేహన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతిచెందని వృద్ధురాలుకు 65 ఏళ్లు ఉండొచ్చన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వెస్ట్ మారేడుపల్లిలో ఫుట్‌పాత్‌లపై వ్యాపార సముదాయాల కూల్చివేత

మారేడుపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్లకు ఇరువైపులా ఉన్న అక్రమ వ్యాపార సముదాయాల కూల్చివేతలకు జీహెచ్ఎంసీ, కంటోన్మెంట్ బోర్డు, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ అధికారులు శ్రీకారం చుట్టారు. వెస్ట్ మారేడుపల్లిలో కొందరు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి షెడ్లు ఏర్పాటు చేసి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారి ఏసీపీ సుస్మిత, ఐపీఎస్ అధికారి విశ్వప్రసాద్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, కంటోన్మెంట్ బోర్డు హెల్త్ సూపరింటెండెంట్ దేవేందర్, ఏసీపీ శంకర్ రాజు పర్యవేక్షణలో రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన వ్యాపార సముదాయములను ఎక్సకవేటర్‌తో కూల్చివేయించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూల్చివేతలు కొనసాగాయి. కూల్చివేతల్తో మారేడుపల్లి ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ చౌహాన్, జీహెచ్ఎంసీ సూపర్‌వైజర్ ప్రకాష్, లా అండ్ ఆర్డర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మెండా మార్కెట్ ప్రాంతంలో రోడ్డుపై చెత్త

చెత్తను తొలగించండి

అడ్డగుట్ట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మోండా మార్కెట్ సమీపంలోని సంజనాప్లే స్కూలు వద్ద వారం రోజులుగా చెత్తను తొలగించకపోవడంతో దుర్వాసన వెలువడుతుంది. పక్కనే బస్తీ దవాఖానాకు వస్తున్న ప్రజలు, స్కూల్ విద్యార్థులతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను తొలగించాలని కోరుతున్నారు.